కథ

# ఆంటీ ఫోబియా

**ఐదేళ్ళ మా పాపకు కొత్త బట్టలు కొందామని రెడీమేడ్ షాప్‌కు వెళ్ళాను. గ్లాసుడోర్ తెరవగానే "రండి ఆంటీ! వెల్‌కమ్!" అని కౌంటర్‌లో కూర్చున్న బానపొట్ట, బాల్డ్ హెడ్, చత్వారం కళ్ళజోడుతో వున్న ఓ వ్యక్తి ఆహ్వానించాడు.**

అతని నోట 'ఆంటీ' అన్న నన్ను గురించిన సంబోధన విని ఉలిక్కిపడ్డాను. అక్కడే ఎదురుగా కనిపించిన మిర్రర్‌లో నన్ను నేను చూసుకున్నాను. సింథటిక్ శారీని కట్టుకున్న స్లిమ్ పర్సనాలిటీ, పోనీటేల్, నుదుటి మీద నృత్యం చేస్తున్న నల్లటి ముంగురులు. ఇవన్నీ నేనింకా మధ్యవయసులోకి కూడా అడుగుపెట్టలేదని చెప్పక చెబుతున్నాయి.

మరి అతని నోట ఈ 'ఆంటీ' అన్న పిలుపేమిటి! ఆశ్చర్యపోయాను నేను. వళ్ళు మండిపోయింది. ఉక్రోషం పొడుచుకుని వచ్చింది. అంతే.. ఏమీ కొనకుండానే ఆ షాపు మెట్లు దిగి మరో షాపు వైపు నడిచాను. ''వెళ్ళిపోతున్నారేమిటి ఆంటీ! మీకేం కావాలో చెప్పండి'' అంటూ వెనక నుంచి లబలబా మొత్తుకున్నాడు సదరు షాపు అతను.

'బాగా అయింది. రోగం కుదిరింది' అని నాలో నేనే ఆనందపడిపోయాను ఆ తర్వాత.

యాబిడ్స్‌లోని మరో పెద్ద షాపులోకి అడుగుపెట్టగానే ''రండి మేడమ్! వెల్‌కమ్!'' అంటూ సాదరంగా ఆహ్వానించటంతో 'మేడమ్' అన్న ఆ పిలుపు మండుతున్న గుండెమీద చన్నీటి జల్లు చిలకరించినట్లయితే నా మనసు కాస్తంత కుదుటపడింది.

షాపింగ్ ముగించుకుని అలసటగా ఆటో స్టాండు వైపు నడిచాను.


''ఆంటీ! ఆటో కావాలా?'' అంటూ ముందుకొచ్చాడు ఆటోవాలా ఒకతను నన్ను ఉద్దేశించి.

మళ్ళీ ఉలికిపాటు.. మళ్ళీ వళ్ళు మంట.

చకచకా ఆ ఆటోను దాటేసుకుని పక్కకు వెళ్లి అతను చూస్తుండగానే మరో ఆటోలో వెళ్లి కూచుని ''పోనీయ్'' అన్నాను. క్వశ్చన్ మార్క్ ముఖంతో అతను అలాగే చూస్తుండిపోయాడు ఆ దృశ్యాన్ని చూస్తూ. 'ఇలా ఇతను ఎన్ని గిరాకీలు పోగొట్టుకుంటున్నాడో రోజుకు' అనుకున్నాను అదో విధమైన ఆనందం అంతరంగంలో కలుగుతుండగా.

ఆరోజు మా ఇంటికి చుట్టాలొచ్చారు.

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన మా పెద్దమ్మ కూతురు వనజ సిటీ చూద్దామని పిల్లలతో సహా వచ్చింది.



ఇరవై ఏళ్ళ ఆమె కూతుర్ని పట్టుకుని మా అమ్మాయి 'ఆంటీ' అని పిలుస్తుంటే.. ''ఆంటీ ఏమిటీ నీ ముఖం.. అక్క అని పిలవాలి'' అని దానికి గద్దించి మరీ చెప్పాను.

''నాకు అక్క అవుతుందా తను.. హాయ్.. భలే భలే'' అంటూ సంతోషంతో దాన్ని పక్కకు తీసుకెళ్ళింది కబుర్ల కోసం.

అప్పుడు మా వనజ అం

''దానికంటే వరసలు తెలియక అలా పిలిచింది. అదేం విచిత్రమే మీ సిటీలో అందరూ అందర్నీ 'ఆంటీ' అని పిలిచేస్తారు. అది ఫ్యాషనా లేక ఏదయినా తలతిక్క రోగమా. మా ఊళ్ళో మేమూ వరసలు పెట్టి పిలుకుంట పిన్నమ్మా.. అత్తమ్మా'

డా. కొఠారి వాణీచలపతిరావు

అని వయోభేదం పాటిస్తూ పిలిచే ఆ పిలుపులో ఓ గౌరవం ఉంటుంది- పెద్దరికం ఇస్తున్న భావన ఉంటుంది. ఇక్కడ 'ఆంటీ' అంటుంటే అది పిన్ని అనో అత్త అనో అర్థం కాదు'' అని వనజ అంటుంటే దానికి ముక్తాయింపు నేనిచ్చాను.

''ఈ సిటీలో 'ఆంటీ' అని పిలిచే అరటిపండ్ల బండి ఆదెయ్యకు, రిక్షా రామయ్యకు, చెప్పులు కుట్టే చెలమయ్యకు, గడ్డం గీసే గంగయ్యకు, చెత్తపట్టుకెళ్ళే చెన్నమ్మకు అసలు ఆ పదానికి అర్థం తెలియదు. 'ఆంటీ' అని పిలుస్తూంటే తమకు ఇంగ్లీషు ఆసాంతం వచ్చేసినట్లు ఫీలవుతూ 'చదువుకోకపోయినా మేమూ భాషా ప్రయోగంలో తక్కువేమీ కాదు' అని పోజొకటి పెడుతూ వుంటారు. అదో ఫ్యాషన్ పదమైపోయింది ఈరోజుల్లో. అర్థం తెలియని పదం గనుక అది ఎవరిని ఉద్దేశించి ప్రయోగించాలో కూడా వాళ్ళకు తెలియదు'' అన్నాను.

''అదా సంగతి'' అని మా అక్క వనజ అంటూండగానే ఆ రోజే మా ఇంటికి కొత్తగా వచ్చిన పనిమనిషి పెంటమ్మ ''ఆంటీ అంట్లగిన్నెలు సందునేత్తారా?'' అని అడిగింది నా మాటలను నిజం చేస్తూ. మా వనజక్క ముసిముసి నవ్వులు నవ్వింది. అంతటితో ఊరుకోకుండా ''ఆంటీ అంటే అర్థం ఏమిటే? తెలియక అడుగుతున్నాను'' అంది.


పెంటమ్మ ఆ ప్రశ్నకు తెల్లముఖం వేసి..

''నాకు మాత్తరం ఏం తెలుత్తది.. ఆం.. అమ్మా! అందరంటుంటే నేనంటన్నాను. ఇదేదో బాగున్నాది కదా అని'' అంది.

అంతటితో వనజ దాన్ని వదిలిపెట్టలేదు.

''ఇప్పుడు అన్నావు చూడు.. ఆంటీ.. అనబోయి 'అమ్మా' అని. ఏం ఆ పదం బాగాలేదా? దాన్ని వదిలిపెట్టి వచ్చీరాని ఈ ఆంటీ ఏమిటి?'' అని ఒక్క దులుపు దులిపింది.

దాంతో కిమ్మనలేదు




పెంటమ్మ. ''తమరన్నదీ నిజమేలెండి. ఇక నుంచి అలానే పిలుత్తాను'' అని అంగీకారం మాత్రం తెలిపింది.

అది ఒక్కతే అంగీకరిస్తే ఏంటి లాభం? బయట ప్రపంచంలో నన్ను 'ఆంటీ' అని పిలిచే అక్కుపక్షులు అడుగుకు ఒకరున్నారు. వాళ్ళందరి నుంచీ ఎలా తప్పించుకోవటం?

అందుకే ఈమధ్య 'ఆంటీ' ఫోబియో పట్టుకుంది నాకు. అది నిరంతరం మనసును పట్టి పీడిస్తూ ఉంది పెద్ద భూతంలా- నన్ను వెంటాడి వేధిస్తూ ఉంది. ఇంట్లో ఉన్నా, బయట కాలు పెట్టినా.


★ ★ ★

మేము ఈమధ్యనే ఇల్లు మారాం. అపార్ట్‌మెంట్ నుంచి ఇండిపెండెంట్ ఇల్లొకటి తీసుకుని అందులోకి షిఫ్ట్ అయిపోయాం.

పెద్ద ఇల్లు. ఇంటి చుట్టూ పూల మొక్కలు.. ప్రశాంత వాతావరణం. హాయిగా అనిపించింది. అద్దె కొంచెం ఎక్కువయినా జనారణ్యంలో నుంచి ఆశ్రమంలాంటి ఆ చోటుకు వచ్చి పడినందుకు నాకు చాలా ఆనందం కలిగింది.

మా ఇంటి పక్కనే వున్న మరో పెద్ద ఇంట్లో కాపురం ఉంటారు ఇంటి వోనర్ వాళ్ళు.

ఆవిడ భారీకాయంతో, అంత కన్నా భారీ అయిన కంఠస్వరంతో..ఇంటి యజమానురాలి నన్న అహం ముఖంలో ప్రస్ఫుటించేలా గంభీరంగా, దర్పంగా ఉంటుంది. అదేం విచిత్రమో గానీ అంతటి భారీ కాయానికి, ఉల్లి పొరలాంటి నైలెక్స్ చీర కడుతుంది. వాలు జడ వేస్తుంది. లోలకుల లాంటి కర్ణాభరణాలు ధరిస్తుంది. దోసగింజలాంటి పొడుగాటి బొట్టు పెడుతుంది. వీటన్నింటి తాత్పర్యం ఏమిటంటే ఆమె యాభైయేళ్ళ తన వయసును ఓ ఇరవై వరకైనా తగ్గించే ప్రయత్నాన్ని నిరంతరం



## అందాలవిందు

సినిమాల్లోకి వచ్చేటప్పటికి సాదాసీదాగా, నాజూగ్గా ఉండే అమ్మాయిలు రెండు మూడు సినిమాలు చేసేటప్పటికీ బొద్దుగా మారిపోతారు. బొద్దుగుమ్మ నమిత ఇప్పుడు అర్జున్ కొత్త చిత్రం ఎన్‌పినాయక్‌లో నటిస్తోంది. ఈ చిత్రం ఆడియో కూడా విడుదలై అందరి అభిమానాన్ని పొందింది. చిత్రం కూడా మంచి హిట్ అవుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తోంది నమిత. చూద్దాం ఈ ఎన్‌పినాయక్ ఎంతమంది ఆదరణ పొందుతాడో!

చేస్తుంటుంది అన్నమాట.

ఆ ప్రయత్నంలో భాగంగానే కాబోలు ఒక రోజు మా ఇంటికి వచ్చి-

''ఆంటీ! ఇల్లు సౌకర్యంగా ఉందా! ప్రతి రోజూ ఊడ్చి, తుడిచి ఇంటిని నీట్‌గా ఉంచుకోవాలి ఆంటీ..గోడలకు మేకులు కొట్టకండి. నీళ్ళను జాగ్రత్తగా వాడుకోండి. ఇక్కడ వాటర్ ప్రోబ్లమ్ ఆంటీ!'' అంటూ తను వయసులో వున్న పిల్ల అన్నట్లు నేనో ముసలిదాన్ని అన్నట్టు 'ఆంటీ ఆంటీ' అన్న మాటతో నన్ను వాయిగొట్టింది. తన వయసును తగ్గించుకోవటానికి నన్నో సాధనంగా వాడుకుంది. అలా రోజుకు ఎంతమందిని వాడుకుంటుందో మరి! ఆమె ధోరణి చాలా ఇరిటేటింగ్‌గా అనిపించినా ఎలా చెప్పాలో, ఏమని చెప్పాలో తెలియని పరిస్థితి.

ఆమె వచ్చి నన్ను 'ఆంటీ' అని పిలిచినప్పుడల్లా, మావారు కూడా 'ఆంటీ ఆంటీ' అంటూ నన్ను ఎగతాళి చేయడం మొదలుపెట్టారు.

ఓరోజు ఆమె వచ్చేసరికి...తను పేపరు చదువుకుంటూ గుమ్మంలో కూర్చుని వున్నారు. పైట సవరించుకుంటూ పళ్ళు కనిపించేలా నవ్వుతూ ''ఆంటీ ఇంట్లో లేరా అంకుల్?'' అంది మావారి నుద్దేశించి ఆవిడ.

అంతే! దాంతో ఆయన తిక్కకుదిరింది.

అప్పటినుంచీ నన్ను ఆటపట్టించడం మానేసారు. అంతేకాదు ఆమె వస్తున్నట్టు అంత దూరం నుంచి పసిగట్టగానే అక్కడి నుంచి పారిపోయి ఇంట్లో ఏదో ఒక మూల దాక్కుంటున్నారు. ఇలా అయితే లాభం లేదని..ఇద్దరం కూడబలుక్కుని ఓరోజు సమావేశమై...ఈ విషయమై తీవ్రంగా చర్చించాం.

'మా ఇంటావిడ మమ్మల్ని అలా పిలవకుండా ఉండాలంటే ఏం చేయాలా' అని వీరలెవెల్లో డిస్కషన్స్ చేసి ఎన్నో ప్లానులు తయారుచేసి చివరకు ఒకటి ఫైనలైజ్ చేసాం.

ఆ ప్లాన్ నాకు తెగ నచ్చేసింది.

మా ఇంటావిడ వయసు రోగం ఐమీన్ తాను ఇంకా వయసులోనే ఉన్నానన్న ఫీలింగ్‌కు సంబంధించిన రోగం కుదిర్చే సమయం కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తూ కూర్చున్నాను.

ఫస్టు తారీఖు వచ్చింది.

ఇంటి వోనరుకు రెంట్ ఇచ్చే నెపంతో నేను పనిగట్టుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళాను.

ఆ సమయంలో ఆవిడ తన వాలుజడలో పూలచెండు తురుముకునే ప్రోగ్రాములో వుంది. నాలుగు జానల ఆ వాలుజడలో ఒక జాన మాత్రమే తన స్వంతమనీ..మూడు వంతులు 'సవరమ'నీ ఆరోజే నాకు తెలిసింది.

''ఆంటీ! రెంట్ తీసుకోండి'' అని కంచు కంఠంతో నేను అనగానే పక్కనే బాంబు పేలినట్లు ఉలిక్కిపడి పక్కకు తిరిగి చూసింది.

అప్పుడు చూడాలి ఆమె ముఖం. మాడిపోయిన ట్యూబ్‌లైట్ చందం! కళ్ళల్లో కోపం బుసలు కొడుతోంది.

మింగలేదు..కక్కలేదు అన్నట్లు వుంది ఆమె పరిస్థితి.

అది చూసి మనసులోనే నాకు భలే సంతోషమేసింది.


'ఇప్పుడు తెలిసొచ్చింది. తనదాకా వస్తేగానీ తెలియదు ఎవరికయినా' అనుకున్నాను విజయగర్వంతో. విసురుగా నా చేతిలోని డబ్బులు తీసుకుని 'కూర్చోమని' కూడా అనకుండా..గిరుక్కున వెనక్కు తిరిగి లోపలికి వెళ్ళిపోయింది ఆమె ఉక్రోషంతో ఉడుక్కుంటూ.

నేను చకచకా ఇంటికొచ్చి, గబగబా మావారికి జరిగింది చెప్పాను. ఆరాటం అణచుకోలేక.

మావారు ఫక్కున నవ్వారు. నేనూ ఫక్కున నవ్వాను.

మేమలా పగలబడి నవ్వుకుంటుండగా బయట గేటు ముందు నుంచి ఓ బిచ్చగాడి కంఠస్వరం వినిపించింది.

''ఆంటీ! ఓ ముద్ద ఉంటే వెయ్యండి. ఆకలేత్తాంది. సచ్చి నీ కడుపున పుడతా ఆంటీ!''



## నయనతార క్రేజ్!

**తమిళనాట ఇప్పుడు జ్యోతిక నంబర్ వన్ నాయికగా కొనసాగుతూంటే సెకండ్ ప్లేస్‌లోకి నయనతార వచ్చేసింది అని తమిళ సినీ జనాల ఉవాచ. ఎలాగంటారా? జ్యోతిక ఇప్పుడు సినిమాకి 50 లక్షల వరకూ డిమాండ్ చేస్తోందిట. ఆమె తర్వాత అంత డిమాండింగ్‌గా అడగ్గలిగే పొజిషన్‌లో నయనతార వుందిట. ప్రస్తుతం నయనతార పాతిక లక్షల వరకూ పారితోషికాన్ని డిమాండ్ చేస్తోందని చెప్పుకుంటున్నారు. అతి తక్కువ కాలంలో ఇంత క్రేజ్‌ని సంపాదించుకున్న నయనతార నిజంగా లక్కీయే మరి!**

అంతే! నవ్వుతున్న మా నోళ్ళు ఠక్కున మూతబడిపోయాయి.

ఇద్దరం ముఖాముఖాలు చూసుకుని, ఆ తరువాత ఒక్క కసురు కసిరి ఆ బిచ్చగాడ్ని అక్కడి నుంచి పంపేసాం.

ఆ తరువాత మావారు అన్నారు. ''ఇలా ఎంతమందినని కసురుకుంటాం. ఎంతమందికని చెబుతాం. ఈ ఆంటీ పిలుపు అంటువ్యాధిలా ఒకరి నుంచి ఒకరికి అలా వ్యాపించిపోతూ వుంటే'' నిజమేనని అనిపించింది నాకు.

'మమ్మీ, డాడీ సంస్కృతితో మన తెలుగుదనాన్ని కలుషితం చేస్తున్నారని పిల్లల్ని మనం నిత్యం కోపగించుకుంటామే..మరి పెద్దవాళ్ళ మనసుల్లో కాలుష్యంలా వచ్చి చేరిన ఈ 'ఆంటీ' సంస్కృతి మాటేమిటి?' నా మనసులో ఓ పెద్ద ప్రశ్న. సమాధానం మాత్రం శూన్యం.

★